క్లుప్తంగా

ఘనంగా దత్తజయంతి



పూజలందుకుంటున్న దత్తాత్రేయుడు

పెదగంట్యాడ: స్థానిక సమతానగర్‌లోని షిర్డీ సాయి శాంతిధామంలో దత్త జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయునికి ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. పంచామృతాలతో అభిషేకాలు చేశారు. దత్త హోమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సత్యంబాబు, కార్యదర్శి రవిశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సాయి సేవకులు బండి శ్రీనివాసరావు, వైవీ రమణ, పైలా రామారావు, కొండా శ్రీనివాసరెడ్డి, మల్లేశ్వర, రమణబాబు తదితరులు సేవలందించారు.

పల్లాకు సన్మానం



శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఆంధ్ర, జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ చైర్మన్‌గా ఎన్నికైన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును ఆంధ్ర, విశాఖ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఆదివారం గాజువాకలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కబడ్డీ క్రీడను ముందుకు తీసుకువెళ్తానన్నారు. గాజువాక నియోజకవర్గంలో కబడ్డీ స్టేడియం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ నిర్వాహక కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు, ఉరుకూటి బాబూరావు, శ్రీనివాసరావు, సీహెచ్.వి.వి.ఎస్.మూర్తి, పల్లా రమణ, పల్లా బాబూరావు, వి.అచ్చిలినాయుడు, వసంత్, వి.రాజు, ఎం.గణపతిరావు, పల్లా సత్యనారాయణ, పి.కోటేశ్వరరావు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



చైతన్యనగర్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ స్టాలిన్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 72వ వార్డు చైతన్యనగర్‌లో సీసీ రోడ్డు పనులను ఆదివారం వార్డు కార్పొరేటర్ ఏజేస్టాలిన్ పరిశీలించారు. రూ.20 లక్షలతో చేపడుతున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆయన సూచించారు. వార్డు పరిధిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. వార్డులో సీసీ, బీటీ రోడ్లు, డ్రైన్ల పనులు పూర్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు నాయకులు మూర్తి, రాజు, వర్క్ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు సమస్యలపై కేంద్ర మంత్రికి వినతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ప్రస్తుతం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుందని, తక్షణం జోక్యం చేసుకొని పరిస్థితులను చక్కదిద్దాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు స్టీల్‌ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శి జె. రామకృష్ణ వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం రోజు రోజుకు ఉత్పత్తి పెరుగుతున్నా ఉద్యోగులకు సక్రమంగా జీతాలు చెల్లించడం లేదన్నారు. తద్వారా ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసి ఉద్యోగులకు భద్రత కల్పించాలని కోరారు.

మూణ్నాళ్ల ముచ్చటే..!

అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. కనీస నిర్వహణ లేకపోవడంతో దువ్వాడ రైల్వే స్టేషన్‌లో ఏదో ఒక సమస్య కూత పెడుతోంది. స్పెషల్ రైళ్ల రాకపోకలతో స్టేషన్‌కు రద్దీ పెరిగినా వసతులు కల్పించడం లేదు. మరో వైపు ఉన్న సౌకర్యాలు కూడా ప్రయాణికులకు దూరమవుతున్నాయి. దానికి ప్రత్యక్ష ఉదాహరణగా స్టేషన్‌లో లిఫ్ట్ పనితీరునే చెప్పవచ్చు.

- నెలలో మూడుసార్లు లిఫ్ట్‌కు మరమ్మతులు
- నాలుగు రోజుల నుంచి అలకపాన్పు
- లగేజీలు, పిల్లలు, వృద్ధులతో తప్పని పాట్లు
- దువ్వాడ రైల్వేస్టేషన్‌లో పరిస్థితి
- అధికారుల ఉదాసీన వైఖరిపై ప్రయాణికుల మండిపాటు

అగనంపూడి: దువ్వాడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. లిఫ్ట్ అందుబాటులో ఉందని చెప్పుకోవడానికే పరిమితమైంది. లగేజీల మోత తప్పడం లేదు. ఎప్పటికప్పుడు పనిచేయకపోవడంతో ప్రయాణికులు అష్ట కష్టాలు పడుతున్నారు. నెలలో కనీసం రెండు నుంచి మూడు సార్లు అలకపాన్పు ఎక్కుతుండడంతో మెట్లెక్కడానికి లగేజీలు, పిల్లలు, వృద్ధులతో పడరాని పాట్లు పడుతున్నారు. నెల రోజుల్లో మూడుసార్లు మరమ్మతులకు గురవడంతో లిఫ్ట్ ఉన్నా లేనట్టే భావించాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. నాలుగు రోజుల నుంచి లిఫ్ట్ మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రయాణికులు అవస్థలకు గురవుతున్నారు.



లగేజీలు,పిల్లలతో అష్ట కష్టాలు పడుతున్న ప్రయాణికులు



దువ్వాడ రైల్వేస్టేషన్



పనిచేయని లిఫ్ట్

ఇదీ పరిస్థితి

15 నెలల కిందట నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం వైపు రూ.25లక్షల వ్యయంతో లిఫ్ట్‌అమర్చారు. నాలుగో నంబర్‌ప్లాట్‌ఫారం నుంచి ఒకటోనంబర్ ప్లాట్‌ఫారం అనుసంధానంగా ఉన్న వంతెన వద్ద వీట్ని ఏర్పాటు చేశారు. అయితే తరచూ మరమ్మతులకు గురవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. లిఫ్ట్ గ్యారంటీ పీరియడ్ ఉన్నా కూడా ఇలా మరమ్మతులకు గురవుతుంటే కనీసం పట్టించుకొనే అధికారి లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఏర్పాటు చేసిన వారం రోజులకే మరమ్మతులకు గురైంది. అంతే అప్పటి నుంచి నెలలో రెండు నుంచి మూడు సార్లు మరమ్మతులకు గురవుతుండడంతో ప్రయాణికులు అధికారులను తిట్టుకుంటూ లగేజీలు నెత్తిన పెట్టుకొని, పిల్లలను చంకలో పెట్టుకొని మెట్లెక్కుతూ దిగుతున్నారు. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి ఎప్పటికప్పుడు మరమ్మతులకు గురవ్వకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

లిఫ్ట్ మార్చాలి



గ్యారంటీ పీరియడ్ ఉన్నందున కంపెనీ వాళ్లతో మాట్లాడి లిఫ్ట్‌ను మార్చే యోచన చేయాలి. కంపెనీ ప్రతినిధులతో మాట్లాడితే సమస్య పరిష్కారం అవుతుంది. తరచూ మరమ్మతులకు గురవ్వడం, ఒక్కటే లిఫ్ట్ ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం రైల్వేస్టేషన్‌లో రైల్వే కూలీలు కూడా అందుబాటులో లేరు.

– పీకేఎం లక్ష్మి, డీజీఎం స్టీల్‌ప్లాంట్

బ్యాటరీ కార్ట్ ఉన్నా...



లిఫ్ట్ తరచూ పాడవుతోంది. రైల్వే కూలీలు అందుబాటులో లేరు. లగేజీలు, పిల్లలు, వృద్ధులతో ప్లాట్‌ఫారం మీద నుంచి మరోప్లాట్‌ఫారానికి చేరుకోవాలంటే అగచాట్లు పడాల్సి వస్తోంది. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి నిర్వహణపై దృష్టి సారించాలి. నిత్యం అందుబాటులో లిఫ్ట్ ఉండేలా చూడాలి. బ్యాటరీ కార్ట్ ఉన్నా ప్లాట్‌ఫారం నుంచి బయటకు లగేజీలు, వృద్ధులకు తీసుకువెళ్లడానికే పనికి వస్తుంది తప్పా ఒక ప్లాట్‌ఫారం నుంచి వేరే ప్లాట్‌ఫారానికి వెళ్లాలంటే లిఫ్ట్ ఒకటే గతి.

– చిన్ని పూర్ణచంద్రరావు, అగనంపూడి

సీపీఎం ఆధ్వర్యంలో కరెంట్ బిల్లుల దహనం



అక్కిరెడ్డిపాలెంలో కరెంట్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

అక్కిరెడ్డిపాలెం: విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం కరెంట్ బిల్లులను దహనం చేశారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం రామాలయం ఎదురుగా సీపీఎం ఆధ్వర్యంలో స్థానికులు, సీపీఎం నాయకులు కరెంట్ బిల్లులను దహనం చేసి పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు ఎం.రాంబాబు, ఎ.లోకేష్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత చార్జీలను పెంచడం ప్రజలను వంచించడమే అన్నారు. వెంటనే చంద్రబాబు కరెంట్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జోన్ నాయకులు ఎ.నూకేశ్వరరావు, జె.కోటేశ్వరరావు, బి.సుబ్బన్న, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న పల్లకీ ఉత్సవం



పల్లకీ ఉత్సవంలో పాల్గొన్న ఎస్టీబీఎల్ అధినేత బాలాజీ, కృష్ణయ్యలు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీదేవి, భూదేవి సహిత తిరుమలేశునికి పల్లకీ ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మార్గశిర పౌర్ణమి (దత్త పౌర్ణమి)ని పురస్కరించుకొని దివ్యక్షేత్రంలోని మాఢ వీధుల్లో నిర్వహించిన ఉత్సవంలో ఎస్టీబీఎల్ అధినేత బాలాజీ, కృష్ణయ్యలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. సత్యసాయి బాబా 100వ జయంతి వేడుకల్లో భాగంగా సత్యసాయి సేవా సమితి, జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) సంయుక్తంగా సత్యసాయి మందిరంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ ఐరన్ అండ్ టెక్నాలజీ జీఎం టి.గౌతమ్, శార్వాణి దంపతులు శిబిరాన్ని ప్రారంభించారు. 71 యూనిట్లు రక్తం స్వీకరించారు. ఇందులో 38 యూనిట్లను హోమిబాబా కేన్సర్ ఆస్పత్రికి అందజేయగా.. మిగిలినవి విశాఖ బ్లడ్ సెంటర్‌కు ఇచ్చారు. కార్యక్రమంలో సత్యసాయి ప్రతినిధులు ఎస్.ఎం. విష్ణుమూర్తి, ఎస్.కె.ఆర్.కె. రాజు, కె.ఎస్.ఎస్. రాజు, సమన్వయకర్త ఎస్. రవికుమార్, ఎం.వి. శివకుమార్, కె. రామచంద్రతో పాటు వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



శిబిరంలో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ జీఎం గౌతమ్, సత్యసాయి ప్రతినిధులు

350 మంది రక్తదానం

పెదగంట్యాడ: ఏఎస్ఆర్ హెల్పింగ్ హ్యాండ్స్‌ట్రస్ట్ ఫౌండర్ నరేంద్ర ఆధ్వర్యంలో నేవీ డేను పురస్కరించుకుని జీవీఎంసీ 65వ వార్డు బీసీ రోడ్డులో ఆదివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతమైంది. శిబిరాన్ని న్యూపోర్టు పోలీస్ స్టేషన్ సీఐ దాలిబాబు ప్రారంభించారు. సుమారు 350 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానంతో ఎంతో మంది ప్రాణాలు కాపాడవచ్చన్నారు. రక్తం అందుబాటులో లేక ప్రాణాలు పోయే పరిస్థితి మన గాజువాకలో రాకూడదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువత

పుణ్యప్రదం..ధనుర్మాసం

నేటి నుంచి ధనుర్మాసోత్సవాలు

పెదగంట్యాడ: వినాయకనగర్ వుడాకాలనీ మామిడి తోటలో వేంచేసియున్న పద్మావతి అండాళ్ సమేత ప్రసన్న వేంకటేస్వారస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. సోమవారం నుంచి వచ్చే నెల 13 వరకూ ఈ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని వివరించారు. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి ప్రతి రోజూ ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన, సేవాకాలం, మంగళాశాసనం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. భక్తులు పాల్గొని స్వామి ఆశీస్సులు పొందాలని కోరారు.

ధనుర్మాసం విశిష్టత

ధనుర్మాసం విష్ణుమూర్తికి ఎంతో ప్రీతికరమైనది. ర్యుడు ధనుస్సు రాశిలో ప్రవేశించడం వల్ల ధనుర్మాసంగా పేర్కొంటారు. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించేంత వరకు ఉండే పవిత్ర మాసం ఇది. వైష్ణవ సంప్రదాయాల్లో ఈ మాసం అత్యంత పుణ్యదాయకమైంది. ఈ మాసమంతా వైష్ణవాలయాల్లో ప్రతి రోజు తెల్లవారు జామున 4 గంటల నుంచి విశేష పూజలు నిర్వహిస్తారు. గోదాదేవి తన ఆరాధనను పూలమాలలుగా భావించి రంగనాథునికి సమర్పించి ఆయనకు ధరింపజేయాల్సిన మాలను తానే ధరించి ఆయన కృపతో మోక్షాన్ని పొందారని పండితులు చెబుతున్నారు. ఆమె రచించిన తిరుప్పావైలోని 30 పాశురాలను ధనుర్మాసం అంతా వైష్ణవాలయాల్లో పారాయణం చేస్తారు. సూర్యుడు ఉత్తరాయానికి మారే ముందు వచ్చే పుష్యశుద్ధ ఏకాదశినే వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి అంటారు. వైకుంఠ ఏకాదశి వరకు శ్రీ మహావిష్ణువు యోగా నిద్రలో ఉంటారని, వైకుంఠ ఏకాదశి రోజు మేల్కొని ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనమిస్తారని పండితులు చెబుతున్నారు. ఆరోజున ప్రభాత వేళలో స్వామి వారిని ఉత్తర ద్వారంలో దర్శనం చేసుకోవడం ముక్తిదాయకయమని చెబుతున్నారు. ఈ మాసమంతా గృహిణులు ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు పెట్టడం సంప్రదాయం.



ఉక్కు వెంకటేశ్వరస్వామి ఆలయం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలకు విశేష ఏర్పాట్లు చేశారు. సోమవారం వేకువ జాము నుంచి పూజలు ప్రారంభం కానున్నాయి. నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు చేయనున్నారు. జనవరి 13వరకు ప్రతీ రోజు గోత్రనామార్చన, గోదాదేవికు సుప్రభాత సేవ, ఆరాధన, తిరుప్పావై, అర్చన, మంగళాశాసనం, పాశురవిన్నపం నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా జనవరి 3న ఉదయం 5.30 గంటలకు కుత్తువిళక్, 5న మధ్యాహ్నం 3 గంటలకు తిరువీధి రథోత్సవం, 8న ఉదయం 5.30 గంటలకు కర్పూర హారతి ఇవ్వనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. జనవరి 9 నుంచి 13 వరకు గోదాదేవికి ఉదయం అభిషేకం, తోమాల సేవ, అలంకారం నిర్వహించనున్నారు. జనవరి 10న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం 4.30 గంటల నుంచి భక్తులకు స్వామి ఉత్తర ద్వారంలో దర్శనం ఇవ్వనున్నారు. 11న శనివారం కూడారై ఉత్సవం, 13న సాయంత్రం గోదా రంగనాథుల కల్యాణం మహోత్సవం నిర్వహించనున్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు



అగనంపూడిలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పెదగంట్యాడ: ఆంధ్రరాష్ట్రం కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు సేవలను మరువలేమని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొడ్డు కృష్ణారావు, కులుకూరి మంగరాజు అన్నారు. జీవీఎంసీ 76వ వార్డు పెదనడుపూరులోని జ్ఞాన మందిరంలో ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి వాళులర్పించారు. అనంతరం వారు పొట్టి శ్రీరాములుసేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి కులుకూరి శ్రీనివాసరావు, బెల్లాల వెంకటరావు, బచ్చు సోమరాజు, బెల్లాల నాగేశ్వరరావు, బెల్లాల పెంటబాబు, పెంటాజీ, బొడ్డు వెంకటరావు, పండు, వర్ధన్ పాల్గొన్నారు.

- పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాధికారిపీవీ రమణ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.
- స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో ఆదివారం నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కారక్యక్రమంలో మార్టుపూడి పరదేశి, నక్క వెంకటరమణ, సంపంగి ఈశ్వరరావు, పిట్టారెడ్డి, కాకర్ల విజయ్‌కుమార్, పిట్ట చంద్రయ్య, ములకపల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి అగనంపూడి వాసవి క్లబ్ ప్రతినిధులు నివాళులర్పించారు. చైర్మన్ బి. సత్యనారాయణ, వాసవీ క్లబ్ ఉపాధ్యక్షుడు ఐ. గుణేశ్వరరావు మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అన్నారు.

ఆయన త్యాగాన్ని గుర్తించి ఆయన పేరుపై పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా ప్రకటించారన్నారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో కళాశాలలో నిర్మించిన విగ్రహాలకు వచ్చే ఏడాది షెడ్డు వేస్తామన్నారు. కార్యక్రమంలో పుట్ట రమేష్, వంకర రాము, అమర పిన్ని గోవింద, విందుల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు కండిపిల్లి వీధిలో స్థానిక కార్పొరేటర్లు పులి లక్ష్మీబాయి, దల్లి గోవింద్‌రెడ్డిలతో కలసి ఆదివారం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు విస్తృతంగా పర్యటించారు. ప్రజలతో నేరుగా మాట్లాడి వార్డు పరిధిలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా రెవెన్యూ సమస్యలుంటే మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే రెవెన్యూ సదస్సులో అధికారులకు వినతులు ఇవ్వాలని తెలిపారు. అనంతరం కనకదుర్గ అమ్మవారి మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు పులి రమణారెడ్డి, పెద్దాడ సోమునాయుడు, లక్ష్మి, త్రినాథరావు, తమ్మయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో మేము సైతం...



పార్కు పరిసరాలను శుభ్రం చేస్తున్న తిరుమల నగర్ వాసులు

అగనంపూడి: జీవీఎంసీ 87 వార్డు తిరుమల నగర్ వాకర్స్ పార్కులో ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా చెట్ల కొమ్మలు, పిచ్చి మొక్కలు తొలగించి కంపోస్ట్ పిట్‌లో వేశారు. ఇంకుడు గుంతలు, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ప్రాంతాలను శుభ్రం చేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని తద్వారా సుందర విశాఖను స్వచ్ఛ పర్యవేక్షణలో ప్రథమ స్థానంలో నిలపాలని తిరుమల సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమానందం, వసంత్ రెడ్డి, ధర్మరాజు, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం నుంచి రక్షించాలని లారీల అడ్డగింత



పిట్టవానిపాలెంలో లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

పెదగంట్యాడ: సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన యాష్ పాండ్ నుంచి వచ్చే దుమ్ము ధూళి కారణంగా అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నామని జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని పిట్టవానిపాలెం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్యం బారి నుంచి తమను కాపాడాలని డిమాండ్ చేస్తూ యాష్ పాండ్ నుంచి పరిమితికి మించి అధిక లోడ్‌తో పిట్టవానిపాలెం గ్రామం మీదగా వెళ్లున్న లారీలను అదివారం అడ్డుకుని నిరసన తెలిపారు. గ్రామస్తులు బట్టు పైడిరెడ్డి, బట్టు అప్పలరెడ్డి, పిట్ట సంజీవరెడ్డి, మరడ అప్పలరెడ్డి, ఆర్ పైడిరాజు, పిట్ట శ్రీను మాట్లాడుతూ యాష్ పాండ్ నుంచి పరిమితికి లోడ్ వేయడం వల్ల రహదారులు దెబ్బతింటున్నాయన్నారు. దుమ్ము, ధూళి కారణంగా గ్రామస్తులు ఊపిరితిత్తుల సమస్యలతో పాటు చర్మంపై మచ్చలు, కంటి సమస్యలు, కిడ్నీ వ్యాధులతో ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి కాలుష్య సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.